చైనాలో 'ప్రెగ్నెంట్' కార్లు!

న్యూఢిల్లీ, ఆగస్టు 11: ప్రెగ్నెంట్ కార్లు..! అదేంటి.. కార్లకు గర్భం రావడమేంటి? అనుకుంటున్నారా?చైనాలో తారెత్తిస్తున్న ఎండలు అటు పౌరులనే కాదు, ఇటు కార్లను కూడా నానా ఇక్కట్లకు గురి చేస్తున్నాయి. కార్ల రక్షణకు వేసిన ప్రొటెక్టివ్ ఫిల్మ్ అధిక వేడికి వ్యాకోచం చెంది కారుకు గర్భమొచ్చినట్టు బాయ్‌నెట్ ప్రాంతంలో పైకి ఎగదన్నుతున్నాయి. ఆడీ లాంటి ఖరీదైన కార్లకు కూడా ఇది తప్పడం లేదు. గర్భం దాల్చినట్టు ఉన్న కార్లకు సంబంధించిన వీడియోలు ఇప్పుడు సామాజిక మాధ్యమంలో వైరల్ కాగా, కొందరు వీటిని 'ప్రెగ్నెంట్ కార్లు'గా వ్యవహరిస్తున్నారు. చైనా కార్లు కొంటున్నారా? వాతావరణం వేడిగా ఉంటే వాటికి గర్భమొస్తుంది జాగ్రత్త' అని చైనా ఎక్స్‌పర్ట్ రిపోర్టర్ జెన్నీఫర్ జెంగ్ ఎక్స్‌లో వ్యాఖ్యానించారు.

గాయాల్ని వేగంగా మాన్పే ఎలక్ట్రిక్ బ్యాండేజీ

వాషింగ్టన్: కొన్ని గాయాలు ఎంతకీ తగ్గవు. ముఖ్యంగా ఈ సమస్య డయాబెటిక్ రోగుల్లో ఎక్కువగా ఉంటుంది. ఇలాంటి వారి కోసం 'ఎలక్ట్రిక్ బ్యాండేజ్'ని నార్త్ కరోలినా స్టేట్ వర్సిటీ సైంటిస్టులు తయారుచేశారు. తీవ్ర గాయాలను సైతం ఈ బ్యాండేజ్‌లు నయం చేయగలవని, సాధారణ బ్యాండేజ్‌లతో పోల్చితే 30% వేగంగా పుండు లేదా గాయం నుంచి ఉపశమనం లభిస్తుందని పరిశోధకులు చెబుతున్నారు. గాయంపై ఈ బ్యాండేజ్‌ని అతికించగానే, ఒక్క నీటి బిందువుతో బ్యాండేజ్‌లోని బ్యాటరీ యాక్టివేట్ అవుతుంది. దీంతో గాయం చుట్టూ విద్యుత్తు క్షేత్రం ఏర్పడి.. కొన్ని గంటల్లో తగ్గడానికి ఆస్కారముందని చెబుతున్నారు. ఎలుకలపై జరిపిన ప్రయోగాల్లో గాయాలు వేగంగా తగ్గాయట! 'దీర్ఘ కాలిక గాయాలతో బాధపడే రోగుల వైద్య చికిత్స వేగవంతం చేయటమే మా పరిశోధన లక్ష్యం' అని పరిశోధకుల్లో ఒకరు బండోద్కర్ చెప్పారు.

5 నిమిషాల్లో 100% చార్జింగ్

బీజింగ్: స్మార్ట్‌ఫోన్లు నిత్య జీవితంలో కీలకంగా మారాయి. వీటి చార్జింగ్ అయిపోతే.. దిక్కుతోచని పరిస్థితి నెలకొంటుంది. ఇలాంటి వారి కోసం చైనా స్మార్ట్‌ఫోన్ తయారీ కంపెనీ 'రియల్‌మీ' సరికొత్త ఫాస్ట్ చార్జింగ్ టెక్నాలజీని అభివృద్ధి చేసింది. కేవలం 5 నిమిషాల్లో స్మార్ట్‌ఫోన్‌ను 100 శాతం చార్జింగ్ అయ్యేలా చేసే కొత్త టెక్నాలజీని సిద్ధం చేసిందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. 300 డబ్ల్యూ (వూక్) చార్జింగ్ సామర్థ్యం కలిగిన టెక్నాలజీని షెన్‌జెన్‌లో(ఆగస్టు 13 నుంచి) ప్రారంభమవుతున్న 'టెక్ ఫెస్టివల్'లో పరిచయం చేయబోతున్నట్టు తెలిసింది. 'ఫాస్ట్ చార్జింగ్‌లో రికార్డ్ బ్రేక్ చేయబోతున్నాం' అంటూ సోషల్ మీడియా 'ఎక్స్' వేదికగా కంపెనీ అధికారిక ప్రకటన విడుదల చేసింది. ఈ టెక్నాలజీతో స్మార్ట్‌ఫోన్ల చార్జింగ్ 0 నుంచి 50శాతం మూడు నిమిషాల్లో, 100శాతం ఐదు నిమిషాల్లో అవుతుందట!

బంగ్లా అల్లర్ల వెనుక అమెరికా!

- మాజీ ప్రధాని హసీనా సంచలన ఆరోపణలు
- సెయింట్ మార్టిన్స్ ద్వీపాన్ని అప్పగించుంటే తన ప్రభుత్వం కొనసాగేదని వ్యాఖ్య
- ప్రధానిగా రాజీనామా తర్వాత జాతినుద్దేశించి చేయాలనుకొన్న ప్రసంగంలో హసీనా వెల్లడి
- అలాంటి ప్రసంగం లేదన్న కుమారుడు సాజీద్

ఢాకా/న్యూఢిల్లీ, ఆగస్టు 11: బంగ్లాదేశ్‌లో ఇటీవల జరిగిన తిరుగుబాటు, అల్లర్ల వెనుక అమెరికా హస్తం ఉన్నదని మాజీ ప్రధాని షేక్ హసీనా చేసిన ఆరోపణలు సంచలనంగా మారాయి. తనకు వ్యతిరేకంగా అమెరికా కుట్ర చేసిందని, సెయింట్ మార్టిన్స్ ద్వీపం కోసమే ఇదంతా చేసిందని వెల్లడించారు. తాను గనుక వ్యూహాత్మకమైన సెయింట్ ద్వీపాన్ని అమెరికాకు అప్పగించి ఉంటే.. తన ప్రభుత్వం కొనసాగేదని పేర్కొన్నారు. రిజర్వేషన్ల వ్యతిరేక ఆందోళనలు, అల్లర్ల నేపథ్యంలో బంగ్లాదేశ్ ప్రధానిగా రాజీనామా చేయకముందు, భారత్‌కు రాకముందు షేక్ హసీనా జాతినుద్దేశించి మాట్లాడాలనుకొన్నారు. కానీ అమె ప్రభుత్వానికి వ్యతిరేకంగా హింసాత్మక ఆందోళనలు కొనసాగుతున్న క్రమంలో సైనిక ఉన్నతాధికారులు అందుకు అనుమతించలేదు. ఆమె జాతినుద్దేశించి చేయాల్సిన ప్రసంగం తాజాగా బయటకు వచ్చిందని మీడియా కథనాలు పేర్కొన్నాయి. అయితే వార్తా నివేదికలను హసీనా కుమారుడు సాజీద్ వాజెజ్ ఖండించారు. అవి పూర్తిగా కల్పితమని, తప్పు అని ఆదివారం రాత్రి ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. ఢాకాను వీడేముందు, తర్వాత ఏ విధమైన ప్రకటన ఇవ్వలేదని తన తల్లి చెప్పారన్నారు.

శవాల ఊరేగింపును చూడాలనుకోలేదు..

తాను మాట్లాడాలనుకొన్న అంశాల గురించి హసీనా తన సన్నిహితులతో చెప్పారని, ఆమె మాట్లాడలేకపోయిన తన ప్రసంగం బయట కొచ్చిందని పలు మీడియా సంస్థలు కథనాలు ఇచ్చాయి. బంగ్లాదేశ్‌లో ప్రభుత్వ మార్పునకు అమెరికా కుట్ర చేసిందని ఆరోపించారు. 'శవాల ఊరేగింపును తాను చూడాలనుకోలేదు. విద్యార్థుల మృతదేహాలపై నడుచుకుంటూ అధికారంలోకి రావాలని వాళ్లు అనుకొన్నారు. అయితే నేను దాన్ని అనుమతించలేదు. ప్రధాని పదవికి రాజీనామా చేశాను. సెయింట్ మార్టిన్ ద్వీపం సార్వభౌమాధికారాన్ని గనుక నేను అమెరికాకు అప్పగించి ఉంటే, బంగాళాఖాతంపై ఆ దేశానికి పట్టు కల్పించి ఉంటే తాను అధికారంలో కొనసాగేదాన్ని. దయచేసి అతివాదుల మాయలో పడొద్దని దేశ ప్రజలను కోరుతున్నాను' అని హసీనా పేర్కొన్నారు. తాను దేశంలోనే ఉంటే మరిన్ని ప్రాణాలను కోల్పోవాల్సి వస్తుందని, అందుకే తాను పదవి నుంచి దిగిపోతున్నానని అన్నారు.

త్వరలో దేశానికి తిరిగొస్తాను

జాతినుద్దేశించి చేయలేకపోయిన ప్రసంగంలో హసీనా తన పార్టీ నేతలు, కార్యకర్తలకు కూడా సందేశం ఇచ్చారు. అవామీ లీగ్ పార్టీ తిరిగి నిలబడుతుందని, ఆశ కోల్పోవద్దని, తాను త్వరలో దేశానికి తిరిగి వస్తానని పేర్కొన్నారు. అవామీ లీగ్ పార్టీ నేతలను లక్ష్యంగా చేసుకోవడం తనకు చాలా బాధగా ఉందన్నారు. ఆందోళనలు చేస్తున్న విద్యార్థులను తాను రజాకార్లు అని పిలువలేదని ఈ సందర్భంగా ఆమె వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు.

సెయింట్ మార్టిన్స్ ద్వీపం ప్రాధాన్యమేంటి?



సెయింట్ మార్టిన్స్ ద్వీపం విస్తీర్ణం కేవలం 3 చదరపు కిలోమీటర్లు. 3,700 మంది నివాసం ఉంటారు. వీరంతా చేపల వేట, వరి, కొబ్బరి సాగు, సముద్రపు పాచి సేకరణపై ఆధారపడి జీవిస్తుంటారు. ఈ ద్వీపం బంగాళాఖాతం సముద్రానికి ఈశాన్యంలో, బంగ్లాదేశ్‌కు దక్షిణాన తొమ్మిది కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. మయన్మార్ సరిహద్దుకు సమీపంలో ఉండే సెయింట్ మార్టిన్స్ బంగ్లాదేశ్‌కు ఉన్న ఏకైక ద్వీపం. ఇది 1947 వరకు బ్రిటీష్ ఇండియాలో భాగంగా, ఆ తర్వాత పాకిస్థాన్ నియంత్రణలోకి, అనంతరం 1971లో బంగ్లాదేశ్‌లో ఒక భాగమైంది. దీనికి సంబంధించి బంగ్లాదేశ్, మయన్మార్ మధ్య 1974లో ఒప్పందం కుదిరినప్పటికీ, ద్వీపం సముద్రపు సరిహద్దు విభజనపై వివాదం ఉండేది. సెయింట్ మార్టిన్ ద్వీపంపై అంతర్జాతీయంగా ప్రధానంగా అమెరికా, చైనా దృష్టి సారించాయి. రీజియన్‌లో తమ ఉనికి బలోపేతం చేసుకొనేందుకు ఈ ద్వీపాన్ని ఉపయోగించుకోవాలనుకొన్నాయి. ఈ ద్వీపంలో ఎవరు మిలటరీ బేస్‌ను నిర్మించుకొన్నా చైనా ప్రధానంగా రవాణాకు ఉపయోగించే మలక్కా జలసంధిపై వ్యూహాత్మక ఉనికి కలిగి ఉండొచ్చని విశ్లేషకులు చెబుతున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో తమ గెలుపునకు సహకరిస్తే బదులుగా సెయింట్ మార్టిన్స్‌లో మిలటరీ బేస్‌ను కట్టుకొనేందుకు ద్వీపాన్ని అమెరికాకు అమ్మేసేలా మాజీ ప్రధాని ఖాలిదా జియా నేతృత్వంలోని బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీ(బీఎన్‌పీ) ప్లాన్ వేసిందనే ఆరోపణల తర్వాత ఈ ద్వీపంపై అందరి దృష్టి పడింది. ఈ ఆరోపణలను అమెరికా ఖండించింది.

ఫోన్ బానిసత్వాన్ని దూరం చేసే చాస్టిటీ బెల్ట్

న్యూఢిల్లీ, ఆగస్టు 11: పొద్దున నిద్రలేచినప్పటి నుంచి రాత్రి పడుకొనేదాకా.. ఫోన్ లేనిదే క్షణం గడవని పరిస్థితి. ఫోన్‌కు అంతలా బానిసలుగా మారిపోయాం. ఈ బానిసత్వాన్ని దూరం చేసేలా చాస్టిటీ బెల్ట్‌ను 'ది కోచ్' యాప్ నిర్వాహకులు అభివృద్ధి చేశారు. ఈ బెల్ట్ అచ్చం.. మధ్యయుగ కాలంలో శృంగారం నుంచి మహిళలను కట్టడి చేసేందుకు వాడిన చాస్టిటీ బెల్ట్‌ను పోలి ఉండటం గమనార్హం. ఆ బెల్ట్‌కు కొంచెం ఆధునికతను జోడించి ఫోన్, కంప్యూటర్ కోసం తయారుచేశారు. దీన్ని రూ.8 వేలకు ది కోచ్ యాప్ ద్వారా విక్రయిస్తున్నారు. ఈ బెల్ట్‌ను ఫోన్/కంప్యూటర్‌కు తగిలించి, తాళం వేయాలి. తాళం చెవిని నమ్మకస్థులకు ఇచ్చి బానిసత్వాన్ని దూరం చేసుకోవచ్చు అంటున్నారు నిర్వాహకులు. ఫోన్ వ్యసనాన్ని నిరోధించేందుకు ఇలాంటి పరికరం తీసుకురావడం ప్రపంచంలో ఇదే తొలిసారని వారు చెబుతున్నారు.

మణిపూర్‌లో మళ్లీ హింస

ఒకే వర్గానికి చెందిన నలుగురు మృతి

ఇంఫాల్, ఆగస్టు 11: మణిపూర్‌లో ఒకే సామాజిక వర్గానికి చెందిన ఇరు వర్గాల మధ్య జరిగిన కాల్పుల్లో నలుగురు మృతి చెందారు. తెంగ్నౌపాల్ జిల్లాలోని ఓ గ్రామంలో యునైటెడ్ కుకీ లిబరేషన్ ఫ్రంట్ మిలిటెంట్లకు, అదే సామాజిక వర్గానికి చెందిన గ్రామ వాలంటీర్లకు మధ్య శుక్రవారం మల్నోమ్ ప్రాంతంలో కాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనలో ముగ్గురు వాలంటీర్లు, ఒక మిలిటెంట్ మృతి చెందారు. దీంతో ఆగ్రహం చెందిన వాలంటీర్లు యూకేఎల్ఎఫ్‌కు చీఫ్‌గా ప్రకటించుకున్న ఎస్ఎస్ హాకొపి గృహాన్ని దహనం చేశారు. పల్లెల ప్రాంతంలో రుసుంల వసూళ్లపై ఆధిపత్యం కోసమే ఈ కాల్పులు జరిగినట్టు భావిస్తున్నారు. కాల్పుల ఘటనతో అప్రమత్తమైన భద్రతా దళాలు గాలింపు చర్యలు చేపట్టాయి.

109 రకాల కొత్త వంగడాలు

ఆవిష్కరించిన ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: ఎలాంటి వాతావరణాన్నైనా తట్టుకోగల, అధిక దిగుబడి నిచ్చే 109 రకాల కొత్త వంగడాలను ప్రధాని మోదీ ఆదివారం ఆవిష్కరించారు. వ్యవసాయ ఉత్పాదకత, రైతుల ఆదాయాన్ని పెంపొందించటంలో భాగంగా ఈ విత్తన రకాలను దేశవ్యాప్తంగా రైతులకు అందుబాటులోకి తీసుకొస్తున్నట్టు కేంద్ర వ్యవసాయ శాఖ ప్రకటించింది. వ్యవసాయ, ఉద్యానవన పంటలకు సంబంధించి భారత వ్యవసాయ పరిశోధన మండలి (ఐసీఏఆర్) 61 రకాల పంటలకు సంబంధించి 109 రకాల విత్తనాలను అభివృద్ధి చేసింది.

విదేశాంగ మాజీ మంత్రి నట్వర్ సింగ్ కన్నుమూత

న్యూఢిల్లీ: విదేశాంగ మాజీ మంత్రి కే నట్వర్ సింగ్ (93) శనివారం రాత్రి కన్నుమూశారు. ఆయన చాలా కాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నారు. రెండు వారాల నుంచి గురుగ్రామ్‌లోని మేదాంత హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. నట్వర్ సింగ్ రాజస్థాన్‌లోని భరత్‌పూర్‌లో 1931లో జన్మించారు. ఆయన దౌత్యవేత్తగా జీవితాన్ని ప్రారంభించారు. దౌత్య రంగంలో సాధించిన అనుభవాన్ని రాజకీయ రంగానికి జోడించి సేవలందించారు. ఆయనకు 1984లో 'పద్మభూషణ్' పురస్కారం లభించింది. 2004-05 మధ్య కాలంలో యూపీఏ-1 ప్రభుత్వంలో ఆయన విదేశాంగ మంత్రిగా పని చేశారు.

జాక్వెలిన్‌కు బర్త్‌డే గిఫ్ట్‌గా లగ్జరీ నౌక!

న్యూఢిల్లీ: ఈ నెల 11న బాలీవుడ్ నటి జాక్వెలిన్ ఫెర్నాండెజ్ బర్త్‌డే సందర్భంగా ఆమెకు ఆర్థిక నేరగాడు సుకేశ్ చంద్రశేఖర్ లగ్జరీ నౌకను కానుకగా ఇవ్వనున్నాడట. అలాగే ఆమె అభిమానులకు 100 ఐఫోన్లను బహుమతులుగా పంపాడట. ఈ మేరకు అతడు జాక్వెలిన్‌కు లేఖ రాశాడు. 'మై బేబీ గర్ల్, మై బొమ్మ వెరీ వెరీ హ్యాపీ బర్త్‌డే. లేడీ జాక్వెలిన్(నౌక పేరు)ను నీకు పంపుతున్నా. ఇదే నెలలో అది నీకు అందుతుంది. చట్టబద్ధంగా అన్ని పన్నులు చెల్లించాను. వచ్చే ఏడాది బర్త్‌డే వేడుక ఇద్దరం కలిసి చేసుకుందాం' అని లేఖలో పేర్కొన్నాడు.

5 కిలోల ఆలుగడ్డలు లంచం..

ఎస్ఐ సస్పెన్షన్!

లక్నో, ఆగస్టు 11: యూపీలో ఒక పోలీస్ అధికారి ఒక రైతు నుంచి ఐదు కిలోల ఆలుగడ్డలు లంచంగా అడిగి సస్పెండ్ అయ్యాడు. అతడు రైతును ఐదు కిలోల ఆలుగడ్డ లంచంగా ఇవ్వాలని డిమాండ్ చేయగా, అంత ఇచ్చుకోలేనని రైతు అనడంతో చివరకు బేరం మూడు కిలోలకు కుదిరింది. ఈ సంభాషణ ఆడియో వైరల్ కావడంతో అధికారులు లంచం అడిగిన కన్నౌజ్ జిల్లా సౌరిక్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ రామ్‌కృపాల్ సింగ్‌ను సస్పెండ్ చేస్తున్నట్టు ప్రకటించారు. అయితే ఆలుగడ్డ అని ఎస్ఐ వాడినది కోడ్ వర్డ్ అని, బహుశా 5 కేజీలు అంటే రూ.5 వేలు, లేదా రూ.5 లక్షలు కావచ్చునని కన్నౌజ్ ఏసీపీ తెలిపారు.

ఐఈఆర్ డైట్‌తో ఊబకాయానికి చెక్

బీజింగ్, ఆగస్టు 11: ఊబకాయం సమస్యను పరిష్కరించుకునేందుకు దోహదపడే గొప్ప విజయాన్ని శాస్త్రవేత్తలు సాధించారు. క్యాలరీల స్వీకరణను పరిమితం చేయడం ద్వారా ఉదరం, మెదడులో గణనీయ మార్పులు చోటుచేసుకుంటాయని, ఇది ఆరోగ్యకరమైన రీతిలో శరీర బరువును తగ్గించుకునేందుకు సరికొత్త మార్గాలను తెరుస్తుందని కనుగొన్నారు. అడపా దడపాగా శక్తిని పరిమితం చేసే ఐఈఆర్ (ఇంటర్‌మిట్టెంట్ ఎనర్జీ రెస్ట్రిక్షన్) కార్యక్రమాన్ని చైనా పరిశోధకులు నిర్వహించారు. కొన్ని రోజులపాటు పరిమితంగా క్యాలరీలను తీసుకోవడం, ఉపవాసంతో కూడిన ఈ ప్రక్రియలో ఊబకాయులైన 25 మంది వలంటీర్లు 62 రోజులపాటు పాల్గొన్నారు. దీంతో వారు 7.6 కిలోల బరువు తగ్గారు. ఇది వారి మొత్తం శరీర బరువులో 7.8 శాతానికి సమానమని, ఐఈఆర్ వల్ల ఊబకాయానికి సంబంధించిన మెదడు భాగాల పనితీరు మారడం, ఉదరంలో బ్యాక్టీరియా ఏర్పడటమే వారి శరీర బరువు తగ్గుదలకు కారణమని పరిశోధకులు గుర్తించారు.

ఎక్కువగా పళ్లూడిపోతే గుండె జబ్బులు!

న్యూఢిల్లీ: ఎక్కువగా పళ్లూడిపోతే గుండె జబ్బులు వచ్చే ప్రమాదం ఉన్నదని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. దంతాలు ఊడిపోవడం వల్ల వ్యాధి కారకాలు చిగుళ్లలోకి చొచ్చుకుపోయేందుకు అనుమతి లభిస్తుంది. దీని వల్ల వాటి ప్రసరణ, వాపు పెరుగుతాయి. ఇది గుండెపై ప్రభావం చూపవచ్చు. అయితే దీంతోపాటు ధూమపానం, కొలెస్ట్రాల్, రక్తపోటు స్థాయిలు లాంటివి గుండె జబ్బులు వచ్చే ప్రమాదాన్ని పెంచడంలో కీలక పాత్ర పోషిస్తాయని పరిశోధకులు తెలిపారు. తక్కువ సంఖ్యలో లేదా అసలు దంతాలు కోల్పోని వారితో పోలిస్తే ఎక్కువ సంఖ్యలో లేదా తమ పళ్లన్నీ కోల్పోయినవారికి గుండె జబ్బులు వచ్చే ప్రమాదం 66 శాతం ఎక్కువని పరిశోధకుల విశ్లేషణలో తేలింది. 12 అధ్యయనాలను విశ్లేషించిన అనంతరం నోటి ఆరోగ్యాన్ని మెరుగు పరుచుకోవడం ద్వారా గుండె జబ్బులు వచ్చే ప్రమాదాన్ని తగ్గించుకోవచ్చని పరిశోధకులు తెలిపారు.

నేడు దేశవ్యాప్తంగా వైద్య సేవలు బంద్

- ఫెడరేషన్ ఆఫ్ రెసిడెంట్ డాక్టర్స్ అసోసియేషన్ ప్రకటన
- కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్‌పై హత్యాచారంపై నిరసన
- దవాఖానల్లో వైద్యులకు భద్రత కల్పించాలని డిమాండ్

ట్రైనీ డాక్టర్‌పై హత్యాచారానికి నిరసనగా ఆర్.జి.కర్ దవాఖాన వైద్య సిబ్బంది ధర్నా

కోల్‌కతా, ఆగస్టు 11: పశ్చిమబెంగాల్ రాజధాని కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజీలో ట్రైనీ డాక్టర్‌పై హత్యాచారంపై రెసిడెంట్ డాక్టర్లు భగ్గుమన్నారు. హత్యను నిరసిస్తూ సోమవారం దేశవ్యాప్తంగా పలు రకాల వైద్య సేవలను నిలిపివేయనున్నట్టు ది ఫెడరేషన్ ఆఫ్ రెసిడెంట్ డాక్టర్స్ అసోసియేషన్ (ఫోర్డా) ప్రకటించింది. 'ఆర్‌జీ కర్‌లోని మా సహచరులకు సంఘీభావంగా సోమవారం దేశవ్యాప్తంగా పలు రకాల వైద్యసేవలు నిలిపివేయాలని నిర్ణయించాం. ఇది తేలికగా తీసుకున్న నిర్ణయం కాదు. ఎలాంటి జాప్యం లేకుండా తమకు న్యాయం చేయాలన్న డిమాండ్‌తో ఈ నిర్ణయం తీసుకున్నాం' అని పేర్కొన్నది. ఆర్‌జీ వైద్యుల డిమాండ్లను పరిష్కరించాలని, నిరసన తెలుపుతున్న వైద్యులపై ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోరాదని, బాధిత కుటుంబానికి పరిహారం చెల్లించాలని, అన్ని దవాఖానల్లో వైద్యుల భద్రతకు కేంద్రం ప్రొటోకాల్ విడుదల చేయాలని ఫోర్డా డిమాండ్ చేసింది.

నిందితుడిని పట్టించిన ఇయర్‌ఫోన్

కోల్‌కతాలో ఆర్‌జీ కర్ కాలేజీలో 28 ఏండ్ల ట్రైనీ డాక్టర్ హత్యకు గురయ్యారు. శుక్రవారం రాత్రి అర్ధనగ్న స్థితిలో బాధితురాలి మృతదేహం లభ్యమైంది. ఆమెపై లైంగికదాడి జరిగినట్టు నిర్ధారణ అయింది. నిందితుడు సంజయ్‌రాయ్‌ని పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. శుక్రవారం రాత్రి అతడి విరిగిన ఇయర్‌ఫోన్ వైద్యురాలి హత్య జరిగిన సెమినార్ రూమ్‌లో దొరికింది. అదే అతడిని పట్టించింది. ఆ రోజు తెల్లవారుజామున 4 గంటలకు ఎమర్జెన్సీ భవనంలోకి వెళ్తున్నప్పుడు బ్లూటూత్ డివైజ్ అతని మెడలో ఉంది. 40 నిముషాల అనంతరం బయటకు వచ్చేటప్పుడు అది అతడి మెడలో లేదు. కొంతసేపు పెనుగులాట తర్వాత డాక్టర్‌ను గొంతు పిసికి చంపినట్టు నిందితుడు అంగీకరించాడని పోలీసులు చెప్పారు. ఆ సమయంలో నిందితుడు మద్యం మత్తులో ఉన్నాడన్నారు. సంజయ్ రాయ్‌కు ఇదివరకే నాలుగుసార్లు పెండ్లిండ్లు అయ్యాయి. అయితే అతని ప్రవర్తన కారణంగా ముగ్గురు భార్యలు అతడిని వదిలి వెళ్లిపోగా. నాలుగో భార్య గత ఏడాది మరణించింది. సంజయ్ రాయ్ పోలీస్ పౌర వాలంటీర్‌గా పనిచేస్తున్నాడు. పోకిరీ చేష్టలతో స్థానికులకు ఎప్పుడూ ఇబ్బందులు కలిగించేవాడని తెలిసింది.

హిండెన్‌బర్గ్ ఆరోపణలపై జేపీసీ వేయాలి

మొదటిపేజీ తరువాయి...

మారాయి. 'సమ్‌థింగ్ బిగ్ సూన్ ఇండియా' అంటూ ఎక్స్‌లో పేర్కొన్న గంటల వ్యవధిలోనే ఈ బాంబు పేల్చింది. ఈ నేపథ్యంలో సెబీ చైర్‌పర్సన్‌పై హిండెన్‌బర్గ్ చేసిన ఆరోపణల నిగ్గు తేల్చేందుకు జాయింట్ పార్లమెంటరీ కమిటీ(జేపీసీ) విచారణ చేయించాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ స్కామ్‌ను సుప్రీంకోర్టు సుమోటోగా తీసుకోవాలని ప్రతిపక్ష కాంగ్రెస్ కోరింది. అదానీ కుంభకోణంపై దర్యాప్తు సంస్థగా ఉన్న సెబీ చీఫ్‌పై కూడా ఆరోపణలు వస్తున్న క్రమంలో ఈ మొత్తం వ్యవహారాన్ని సుప్రీంకోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు జరగాల్సిన అవసరం ఉన్నదని పేర్కొన్నది. తీవ్రమైన ఆరోపణల నేపథ్యంలో బచ్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేసింది. సమగ్ర దర్యాప్తు జరిగే వరకు సెబీ చీఫ్‌గా మాధవి బచు తప్పుకోవాలని వామపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి.

హిండెన్‌బర్గ్ వ్యక్తిత్వ హననం

హిండెన్‌బర్గ్ ఆరోపణలను సెబీ చీఫ్ మాధవి పురీ బచ్, ఆమె భర్త ధావల్ ఖండించారు. సెబీ విశ్వసనీయతను దెబ్బతీయడంతో పాటు దాని చైర్‌పర్సన్ వ్యక్తిత్వ హననానికి హిండెన్‌బర్గ్ సంస్థ ప్రయత్నిస్తున్నదన్నారు. ప్రైవేటు వ్యక్తులుగా తాము ఐఐఎఫ్ఎల్ వెల్త్ మేనేజ్‌మెంట్ ప్రమోట్ చేసిన ఫండ్‌లో పెట్టుబడులు పెట్టామని, మాధవి బచ్ సెబీలో పూర్తికాల సభ్యురాలిగా చేరడానికి రెండేండ్ల ముందు ఇది జరిగిందని తెలిపారు. భారత్‌లో పలు ఉల్లంఘనకు సంబంధించి ఇచ్చిన షోకాజ్ నోటీసులకు సమాధానం ఇవ్వని ఆ సంస్థ.. ఈ విధంగా ఎదురుదాడి చేస్తున్నదని ప్రకటనలో పేర్కొన్నారు.

సెబీ చీఫ్‌తో వాణిజ్య సంబంధాలు లేవు: అదానీ గ్రూపు

హిండెన్‌బర్గ్ తాజా ఆరోపణలను అదానీ గ్రూపు ఖండించింది. సెబీ చీఫ్ మాధవి పురీ బచ్‌తో తమ సంస్థకు ఎలాంటి వాణిజ్యపరమైన సంబంధాలు లేవని తెలిపింది. హిండెన్‌బర్గ్ కుట్రపూరితంగా ఆరోపణలు చేస్తున్నదని కొట్టిపారేసింది. వ్యక్తిగత లాభం కోసం వక్రీకరణలు చేస్తూ మదుపరులను తప్పుదోవ పట్టించేందుకు యత్నిస్తున్నదని తెలిపింది. మరోవైపు అదానీ గ్రూపుపై వచ్చిన ఆరోపణలపై తగిన విచారణ జరిగిందని, మాధవి పురీ బచ్ ఎప్పటికప్పుడు వివరాలను బహిర్గతం చేస్తూనే ఉన్నారని సెబీ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపింది.

ఉత్తర, వాయువ్య భారతంలో భారీ వర్షాలు

28 మంది మృతి

న్యూఢిల్లీ, ఆగస్టు 11: ఉత్తర, వాయువ్య భారతంలో ఆదివారం కురిసిన భారీ వర్షాలకు 28 మంది మరణించారు. పలుచోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి, ఇళ్లు నేలకూలాయి. పలుచోట్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. హర్యానాలో పలు గ్రామాలు నీట మునిగాయి. భారీ వర్షాల కారణంగా అమర్‌నాథ్ యాత్రను నిలిపివేశారు. రాజస్థాన్‌లో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు 16 మంది మరణించారు. తూర్పు ఢిల్లీలో భారీ వాన పడింది. గురుగ్రామ్‌లో ఒకేరోజు 70 మి.మీ వర్షపాతం నమోదైంది. ఉత్తరాఖండ్‌లోని భీంబలిలో భారీయెత్తున కొండచరియలు కూలాయి. దీంతో మందాకినీ నదీ ప్రవాహానికి స్వల్ప అంతరాయం ఏర్పడింది. పంజాబ్‌లో నదిలో ఎస్‌యూవీ కొట్టుకుపోవడంతో హిమాచల్‌కు చెందిన 10 మంది ప్రాణాలు కోల్పోయారు. వీరిలో 9 మంది ఒకే కుటుంబానికి చెందినవారు.

నిద్రపుచ్చే స్లీప్‌మేకర్స్!

- చైనాలో ప్రాచుర్యంలోకి కొత్త వృత్తి!
- 996 వర్క్ కల్చర్‌తో యువత చిత్తు
- వైవాహిక ఒత్తిళ్లు, మానసిక, ఇతర సమస్యలతో నిద్ర కరువు
- వారి బాధలు విని, ఒత్తిడి పోగొట్టి నిద్రపోయేలా చేసే స్లీప్‌మేకర్స్

బీజింగ్: 'నిదానమే ప్రధానం' అనుకునే రోజులు కావివి. ఏ రంగంలో చూసినా విపరీతమైన పోటీ. దానిని అందుకోవాలంటే పరుగులు పెడుతూనే ఉండాలి. అయితే, ఇలా నిత్యం పరుగులు పెట్టే జీవనం ఎన్నో అనారోగ్య సమస్యలకు దారి తీస్తున్నది. సరిగ్గా ఇదే జరుగుతున్నది చైనాలో. అక్కడ పుట్టుకొచ్చిన '996 వర్క్ కల్చర్' (వారంలో ఆరు రోజులు ఉదయం 9 నుంచి రాత్రి 9 వరకు పనిచేయడం) యువతను నిద్రకు దూరం చేస్తున్నది. వెంటాడే మానసిక సమస్యలు.. వైవాహిక ఒత్తిడి, నిత్య జీవితంలో ఒత్తిళ్లు.. ఎవరికి చెప్పుకోవాలో తెలియక వేదన అనుభవిస్తూ నిద్రకు దూరమవుతున్నారు. అయితే, ఇలాంటి సమస్యలు ఎదుర్కొంటున్న వారిలో మానసిక ఒత్తిడిని పోగొట్టి జోలపాడి హాయిగా నిద్రపుచ్చేందుకు ఓ కొత్తరకం వృత్తి ఇప్పుడక్కడ పుట్టుకొచ్చింది. అదే 'స్లీప్ మేకర్స్'.

గంటకు రూ.3 వేలు

*ఒత్తిడి ఎదుర్కొంటూ నిద్రకు దూరమవుతున్న వారికి స్లీప్ మేకర్స్ ఎమోషనల్‌గా సపోర్ట్ అందిస్తారు. వారి బాధలు వింటారు. ముచ్చట్లాడుతూ వారిలోని ఆందోళనను దూరం చేస్తారు. ఫలితంగా వారు హాయిగా నిద్రలోకి జారుకుంటారు. ఇప